www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 జనవరి 2023
5
ఏలూరు

ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పాలరాజుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ డిఐజి పాలరాజు ఉద్యోగోన్నతి పొందారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏలూరు రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఉద్యోగ రాష్ట్రస్థాయి ప్రమోషన్లలో భాగంగా నలుగురు ఐపిఎస్‌లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా పాలరాజుకు కూడా ఉద్యోగోన్నత కల్పించింది. ఈ సందర్భంగా ఆయనను ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న జిల్లా ఎస్‌పిలు, ఏలూరు నగరంలోని పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు సర్వంసిద్ధం

భీమవరంలో నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ

హాజరు కానున్న కేరళ పరిశ్రమల శాఖా మంత్రి రాజీవ్, జాతీయ నేతలు

2, 3, 4 తేదీల్లో కార్మిక, ఉద్యోగుల సమస్యలపై విస్తృత చర్చలు

ప్రతినిధుల సభ ముఖద్వారం

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం, రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం పట్టణం ముస్తాబైంది. తోరణాలు, జెండాలు, అమరవీరుల ఫ్ల కార్డులు, స్వాగత ద్వారాలతో పట్టణం నలుమూలల కార్మిక సభల వాతావరణం నెలకొంది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ మహాసభ సందర్భంగా తొలిరోజు పది గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభ సభ జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న కేశవరావు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ గ్రౌండ్ వరకూ పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం రెండు గంటలకు బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో కేరళ పరిశ్రమల శాఖా మంత్రి పి.రాజీవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. అలాగే సిఐటియు జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నర్సింగరావు, ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర నేతలు జి.బేబిరాణి, వి.ఉమామహేశ్వరరావు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు ప్రసంగించనున్నారు. ప్రతినిధుల సభా ప్రాంగణానికి టి.షడ్రక్, సావిత్రమ్మ నగర్‌గా నామకరణం చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వెయ్యి మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను కలుపుతూ మూడు అమరవీరుల జాతాలు ఆదివారం రాత్రికి తాడేపల్లిగూడెం చేరుకున్నాయి. ఇవి సోమవారం ఉదయం బయల్దేరి మధ్యాహ్నానికి భీమవరం చేరుకుంటాయి. మహాసభ ఏర్పాట్లను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కార్యనిర్వాహక కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు, గేయాలు

సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆట, పాట, మాట కార్యక్రమంలో భాగంగా చేసిన సాంస్కృతిక నృత్యాలు, అభ్యుదయ గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురజాడ మా అడుగుజాడ, దేశం అంటే మట్టి కాదని, మాకొద్దు నల్ల దొర తనం, కార్మిక కదంబం, చమట చుక్కా వంటి సాంస్కృతిక నృత్యాలు, ఆజాది డాన్స్, ఆవాజ్ దో హమ్ ఏక్ హై డాన్స్‌లు ఆకట్టుకుని ఆలోచింపజేశాయి. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్, నాయకులు ఈశ్వర్‌రావు, ఇ.రాజు, సుంకన్న పాల్గొన్నారు.

కార్మిక, ప్రజలు సమస్యలపైనే ఎజెండాగా చర్చిస్తాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

సిఐటియు రాష్ట్ర మహాసభకు భీమవరం పట్టణం తోరణాలు, జెండాలు, అమరవీరుల ప్లకార్డులతో, స్వాగత ద్వారాలతో పండుగ వాతావరణం నెలకొనేలా ముస్తాబైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అల్లూరి శ్రీరామరాజు విజ్ఞాన కేంద్రం వద్ద మహాసభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టి.షడ్రక్, సావిత్రమ్మనగర్‌లో మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి వెయ్యి మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు, కార్మికులకు విశేష సేవలందించిన కార్మిక నాయకులు ఈ మహాసభలకు ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కార్మికులను ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోలేకపోయాయన్నారు. కరోనా సమయంలో ఆదుకోకపోగా సమస్యలు సృష్టించిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో అనేక పోరాటాలు నిర్వహించిన పోరాటయోధులకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సిద్ధంగా ఉందన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని, మహాసభల ప్రారంభ ఉపన్యాసం సిఐటియు అఖిల భారత కార్యదర్శి మాజీ ఎంపీ తపన్ సేన్ ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పాత బస్టాండ్ సెంటర్ నుండి కార్మిక కర్షక ప్రదర్శన ర్యాలీ జరుగుతుందని, అనంతరం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా కేరళ న్యాయ పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

వాహనాల పార్కింగ్ ఇలా

సిఐటియు భారీ ప్రదర్శన, బహిరంగ సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రదర్శన బహిరంగ సభకు విచ్చేసే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు పార్కింగ్‌కు ఏర్పాటు చేసిన చోటే వాహనాలు నిలుపుదల చేయాలని ఆహ్వాన సంఘం కోరింది.

ఆకివీడు, ఉండి మీదుగా వచ్చు వాహనాలు ఉండి బైపాస్ మీదుగా విజయలక్ష్మి థియేటర్ వద్దకు రావాలి. తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు విజయలక్ష్మి థియేటర్ వద్దకు వచ్చి వాహనాలు అన్నీ డీమార్ట్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి పక్కన రైల్వే గేట్ రోడ్డులో టూ, త్రీ వీలర్స్, మినీ బస్ పార్కింగ్ చెయ్యాలి. లారీలు మాత్రం ఉండి బైపాస్‌లో పార్కింగ్ చేయాలి. పాలకొల్లు వైపు నుంచి వచ్చు వాహనాలు డిపో నుంచి బైపాస్ మీదుగా మెంటేవారితోటలో వండర్ కిడ్స్ గ్రౌండ్స్ లో పార్కింగ్ చెయ్యాలి. లారీలు బైపాస్‌లో పార్కింగ్ చేయాలని కోరారు.

గన్నవరం విమానాశ్రయంలో సిఐటియు జాతీయ నేతలకు స్వాగతం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత, కార్యదర్శి తపన్ సేన్‌లకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి విమానంలో వారు ఇక్కడకు వచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూప రాణి, కృష్ణా జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, సిఐటియు గన్నవరం మండల నాయకులు బడుగు మరియదాసు, ఐలు నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు స్వాగతం పలికారు.అనంతరం జాతీయ నాయకులు భీమవరం బయల్దేరి వెళ్లారు.

గన్నవరం విమానాశ్రయంలో జాతీయ నేతలకు స్వాగతం

గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

పట్టణంలో రెపరెపలాడుతున్న సిఐటియు జెండాలు

పట్టణంలో ఏర్పాటు చేసిన సిఐటియు స్వాగత ద్వారం

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా, ప్రణాళికబద్ధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో ఆర్ఆర్.పేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వేద పండితులు యనమండ్ర రవిప్రకాష్ కలెక్టర్‌ను ఆశీర్వదించి శ్రీవారి ప్రసాదం, హనుమాన్ జంక్షన్ శ్రీ అభయ ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జెసి పి.అరుణ్‌బాబు, డిఆర్ఒ మూర్తి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు, అధికారులు తరలివచ్చి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జిల్లాలో అన్నిరంగాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి సమిష్టి కృషి ఎంతో అవసరమన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, వాటిని మరింత ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో అన్ని విధాలా పాలుపంచుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ఏడాది అన్ని వర్గాల ప్రజలకు చేపట్టే ప్రతి పనిలో విజయాలు సిద్ధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు కె.పెంచల కిషోర్, డాక్టర్ ఝాన్సీరాణి, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిపిఒ మల్లికార్జున్, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ తదితర జిల్లా అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న డిపిఆర్ఒ

ఏలూరు రేంజ్ డిఐజి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ డిఐజి జి.పాలరాజును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పాలరాజుకు ఉద్యోగోన్నతి పొందడం పట్ల అభినందనలు తెలిపారు.

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు నగర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తమ పాలకవర్గానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని మేయర్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు కోరారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులకు కలెక్టర్, జెసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విజుబుల్ శానిటేషన్ లక్ష్యంగా ఏలూరు నగరాన్ని పరిశుభ్రతతో కూడిన ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు.

నూతన సంవత్సర వేడుకలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల అధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు, డివిజనల్ పౌర సంబంధాల అధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది సమక్షంలో నూతన సంవత్సర కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌విఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో అధికారులు, సిబ్బంది ద్వారా నిర్వహించిన శాఖపరమైన విధులు మంచి స్ఫూర్తితో నిర్వహించారని, అదే స్ఫూర్తితో సిబ్బంది అందరూ 2023లో కూడా శాఖాపరమైన విధులు నిర్వహించాలన్నారు. అనంతరం డివిజనల్ పిఆర్ఒ వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఆడియో విజువల్ సూపర్‌వైజర్ సిహెచ్.రాంబాబు, ఎఐఇ ధనుంజయరావు, టైపిస్టు డి.శౌరిప్రసాద్, రికార్డు అసిస్టెంట్ బాబూరావు, ఫొటోగ్రాఫర్ పి.సాగర్, ప్రభాకర్ రావు, వీరభద్రం పాల్గొన్నారు.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న ఎస్‌పికి ఉద్యోగోన్నతి లభించడం పట్ల కలెక్టర్‌కు శర్మకు అభినందనలు తెలిపారు.

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని, ముఖ్యంగా తలసేమియా చిన్నారులకు రక్తదాన శిబిరాలు నిర్వహించడం, జిల్లాలో ఉన్న గిరిజన ప్రాంతాల్లోని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని కృష్ణారెడ్డికి సూచించారు.

తాడేపల్లిగూడెం చేరిన సిఐటియు రాష్ట్ర ప్రచార జాత

భవన నిర్మాణ కార్మికులను విస్మరించిన వైసిపి

ద్వారకాతిరుమల : వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు నిలిపేసిందని, ఇసుక అందుబాటులో లేకుండా చేసి వారి పొట్ట కొట్టిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. ఆదివారం మండలంలోని సిహెచ్.పోతేపల్లిలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటిక నుంచి సహజ సిద్ధంగా దొరికే ఇసుకను బంగారం చేసి, కార్మికులకు పనులు లేకుండా చేశారని, మరోవైపు వ్యాపారాలు లేకుండా, సామాన్యులు ఇళ్ల కట్టుకునే అవకాశం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక విధానాన్ని మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో భీమవరంలో జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మధు, నాగరాజు పాల్గొన్నారు.

1199 మందికి కొత్త పింఛన్లు

ప్రజాశక్తి - దెందులూరు

నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పింఛన్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి స్వయంగా పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం నుంచే ఎమ్మెల్యే దెందులూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి రూ.2500 నుంచి రూ.2750కు పెంచిన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పథకం ద్వారా దెందులూరు నియోజకవర్గంలో ఈనెల ఒకటో తేదీ నుంచి 1199 మంది లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, అందులో దెందులూరు మండలంలో 295 మందికి, ఏలూరు రూరల్ మండలంలో 215 మందికి, పెదపాడు మండలంలో 291 మందికి, పెదవేగి మండలంలో 398 మందికి పెన్షన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం దెందులూరు నియోజకవర్గంలో అమలులో ఉన్న 35,998 మందికి అదనంగా మరో 1199 మంది మొత్తంగా 37197 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరవధిక దీక్ష నేపథ్యంలో

మాజీ మంత్రి జోగయ్య అరెస్ట్, తరలింపు



జోగయ్యతో చర్చిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్యను ఆదివారం రాత్రి హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం నరసాపురం డిఎస్‌పి మనోహర్ పర్యవేక్షణలో అంబులెన్స్‌లో ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ ఆసుపత్రికి తరలించారు. దానికి ముందు ఆయన నివాసం వద్ద దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ, మచిలీపట్నం ఎఎస్‌పిలు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయంలో ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాత్రికి మరిన్ని అదనపు పోలీసు బలగాలు పట్టణానికి చేరుకున్నట్లు సమాచారం.

కాపులకు ఇడబ్ల్యూఎస్‌లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్ష తలపెట్టిన నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ముందుగానే ఇంటి చుట్టూ భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలు, కాపు సంక్షేమ సేన కార్యకర్తలు, ఆయన మద్దతుదారులు ఆ ప్రదేశానికి రాకుండా చేయడానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జోగయ్యతో అధికారుల చర్చలు

జోగయ్య నిరవధిక నిరాహార దీక్ష నేపథ్యంలో నరసాపురం డిఎస్‌పి మనోహర్, పాలకొల్లు తహశీల్దార్ మమ్మీ, సిఐ అఖిల్ జామాలు ఆయనతో ఆదివారం రాత్రి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు. ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని జోగయ్య డిమాండ్ చేశారు.

ప్రాణాలర్పించైనా కాపు రిజర్వేషన్ సాధిస్తా : జోగయ్య

తన ప్రాణాలు పోయిన కాపు రిజర్వేషన్ సాధిస్తానని మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ప్రకటించారు. ఆదివారం ఆయన గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశానని, అయితే ప్రభుత్వం నుంచి స్పందన లేదని చెప్పారు. దీంతో తాను ముందు ప్రకటించినట్లు ఈనెల 2న ఉదయం 9 గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. తన దీక్షను అడ్డుకున్నా, పోలీస్‌స్టేషన్‌కు తరలించినా, ఆసుపత్రికి తరలించినా దీక్ష కొనసాగిస్తానని హెచ్చరించారు.

తాడేపల్లిగూడేనికి రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహసభను, భారీ ప్రదర్శనను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇచ్చాపురం మందస (వీరగున్నమ్మ స్థూపం) నుంచి డిసెంబర్ 28న బయలుదేరిన రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణం చేరింది. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ జాతాకు ఘనస్వాగతం పలికారు. ఈ జాతాను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరశింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి మాట్లాడుతూ భీమవరంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర జీపు ప్రచార జాతా ప్రచారం చేస్తుందన్నారు. భీమవరంలో జరుగుతున్న మహాసభలో ముఠా కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయాలని తీర్మానం చేస్తామన్నారు. అన్ని రంగాల్లో ఉన్న కాంట్రాక్టు వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు 60 సంవత్సరాలు దాటిన తరువాత ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ వంటి సదుపాయాలు అమలు జరిగేలా రాష్ట్ర మహాసభలో చర్చించి అమలుకు నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 38 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఉన్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటివి అమలు కావడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయన్నారు. మోడీ 2014లో అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారన్నారు. బ్రిటీషు కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. భీమవరం జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ, రెండో తేదీన 30 వేల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయడం ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఈ జీపు ప్రచార జాతా ప్రారంభానికి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ ఎన్.రమణరావు, జి.నాగేశ్వరరావు, చిటికిన రాము, జవ్వాది శ్రీను, పి.పైడియ్య పాల్గొన్నారు.

హిందూపురం, కుప్పం నుండి బయలుదేరిన జాతాలు ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం చేరాయి. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓగులు, కె.అజయ్, డి.రమాదేవి, కె.సుబ్బారావమ్మ, ఇతర నేతలు విచ్చేశారు.

ఇకపై ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలోనూ 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

ఈ ఏడాది నుంచి ప్రతి సోమవారం ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పౌరులకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలు, ఆర్‌సి, డిఎల్ కార్డులకు సంబంధించిన సమస్యలను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పౌరులందరూ రవాణా శాఖకు సంబంధించిన సమస్యలను ప్రతి సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించి స్పందన ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

ముస్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి చిన్న దంపతులను సత్కరిస్తున్న వక్తలు

ఘనంగా బత్తిన నాగలక్ష్మి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పుట్టినరోజు వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగలక్ష్మి పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకల్లో పట్టణ ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. బత్తిన నాగలక్ష్మి చిన్న దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖులు, కౌన్సిలర్లు నాగలక్ష్మి చిన్న దంపతులను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, వైస్ చైర్మన్ కంచర్ల వాసవిరత్నం, పలువురు కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

శ్రీనగర్ కాలనీలో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు దొండపాడు శ్రీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీలో నుంచి ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి, నగదును అపహరించారు. ఈ మేరకు బాధితులు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... దొండపాడు శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఒక ప్రయివేట్ సంస్థలో పని చేస్తున్నారు. తండ్రి సూర్యనారాయణకు శస్త్రచికిత్స నిమిత్తం గతేడాది డిసెంబర్ 20న విజయవాడ ఆసుపత్రికి వెళ్లారు. వారు తిరిగి డిసెంబర్ 31వ తేదీ రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చారు. తాళాలు తీయగా తలుపు లోపల గడియ పెట్టినట్లు ఉండడంతో వెనుక వైపు సందులోకి వెళ్లి చూడగా బెడ్ రూం కిటికీ తెరిచి ఉంది. చోరీ జరిగిందనే అనుమానం రావటంతో త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆదివారం క్లూస్ టీం తో వచ్చి ఇంట్లో ఆధారాలు సేకరించారు. రెండు బెడ్ రూంలలో రెండు బీరువాలు పగులగొట్టి వాటిలోని రూ.40వేల నగదు, బంగారు ఆభరణాలు, సుమారు కిలోన్నర వెండి వస్తువులు, ల్యాప్‌టాప్, టివి అపహరించుకుపోయారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీటౌన్ సిఐ కెవిఎస్‌వి.ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్

చెరకు ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామంలో చెరకు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన టి.నరసాపురానికి చెందిన ఒక రైతుకు చెందిన ట్రాక్టర్‌పై చెరకు లోడుతో తాడువాయి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న క్రమంలో మండలంలోని అప్పలరాజుగూడెం సాయిబాబా ఆలయ సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుపై గోతులు ఉండడంతో అధిక లోడుతో వెళ్తున్న చెరకు ట్రాక్టర్లు బోల్తా పడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఆగిరిపల్లి పోలీసులు

కోడిపందేల స్థావరాలపై దాడి

ఏడుగురు అరెస్టు

వేర్వేరు ప్రాంతాల్లో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం ఏడు కోడి పుంజులను, నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సింహాద్రి అప్పారావుపేటలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు కోడి పుంజులను, రూ.2,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యర్రంపల్లిలో ఇద్దరు అరెస్టు

చింతలపూడి : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరికి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కోడిపుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ హరికృష్ణ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.1530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - చింతలపూడి

కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన మండలంలోని శివపురానికి వివాహిత మర్రిబందంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శివపురానికి చెందిన వివాహిత డి.పద్మ (35) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతుకుతుండగా ఆదివారం మర్రిబందంతో చెరువులో పద్మ మృతదేహం లభ్యమైంది. చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు

పంచాయతీ అధికారుల తీరుపై గ్రామస్తుల విమర్శలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే రిక్షాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో ఈ పరిస్థితి కనబడుతోంది. వడాలి, గురజ తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడానికి ప్రభుత్వం వేలాది రూపాయాలతో రిక్షాలను కొనుగోలు చేసి గ్రామాలకు అందించారు. అనేక గ్రామాల్లో ఈ రిక్షాలు నిరూపయోగంగా పక్కన పడేసి ఉన్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిలో కొన్ని రిక్షాలు ఇప్పటికే తప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ఎంతో ఖర్చుచేసి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినా కిందిస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడంలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో తమ గ్రామాలకు చెత్త సేకరణ రిక్షాలు అసలు రావడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. తాము ఇప్పటివరకు చెత్త రిక్షాలను చూడలేదని పలు కాలనీలకు చెందిన కాలనీ వాసులు చెబుతున్నారు. కొన్ని పంచాయతీలకు రిక్షాల నిర్వహణ, కార్మికుల జీతాలు చెల్లింపు వంటివి భారంగా మారడంతో వీటిని మూలనపడేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి పెట్టి నిరూపయోగంగా పడి ఉన్న రిక్షాలతో చెత్త సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గురజలో వాటర్‌ట్యాంక్ వద్ద నిరూపయోగంగా ఉన్న రిక్షాలు

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



సత్కారం పొందిన సీనియర్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పెద్దలు వేసిన పునాదిని కాపాడుకుంటూ వాళ్ల నిర్మించిన బాటలో పయనిద్దామని కార్పెంటర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి అనుపోజు వీరవెంకటబ్రహ్మం అన్నారు. సంఘాలను బలోపేతం చేసుకోవడానికి కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా నడుం బిగించాలని కోరారు. స్థానిక పంచాయతీ కమ్యూనిటీ హాల్ భవనంలో ఆ సంఘం మండల విస్తృతస్థాయి సమావేశం సంఘం మండల అధ్యక్షులు రౌతు సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ మన పూర్వీకులు నిర్మించిన సంఘాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సంక్షేమ బోర్డును సాధించుకున్నట్లు చెప్పారు. పాలకవర్గాలు కార్మికుల పొట్టలపై కొట్టడం అత్యంత బాధాకరమన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే ఈ దాడిని తిప్పికొట్టగలమన్నారు. సంఘాలను బలోపేతం చేసుకోవడానికి కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా నడుం బిగించాలని కోరారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి కె.వెంకట్రావు మాట్లాడుతూ నిత్యం కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభ ఈ నెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగుతుందని, ఈ మహాసభ జయప్రదం కోసం ప్రారంభ సూచికగా జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆ సంఘానికి సుదీర్ఘకాలం పాటు సేవలందించిన సీనియర్లు రౌతు సత్యనారాయణ, మరడాని సోమాచారి, వానపల్లి వీర్రాజు, మారేడుపూడి రామాచార్యులు, కొక్కొండ సత్యనారాయణ, సింగవరపు నాగేశ్వరరావు, చింతలపూడి రత్నచారి, దార్ల మాస్రమ్మ, కొత్తలంక శేషారావు, కౌలూరి అప్పారావులకు సన్మానం చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయం ఛాంబర్‌లో పంచాయతీ కార్యదర్శుల సంఘం 2023వ సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను డిపిఒ జివికె.మల్లికార్జునరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు విజిఎంవిఆర్ కృష్ణారావు, అధ్యక్షులు పగడం నాగేశ్వరరావు, సహాయఅధ్యక్షులు వి.శ్రీనివాసచౌదరి, కార్యదర్శి మేకా శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎస్.కుమార్, పెదవేగి మండల అధ్యక్షులు కె.వెంకట్రావు, జీలుగుమిల్లి మండల అధ్యక్షులు సిహెచ్.స్ఫూర్తి, సభ్యులు, జిల్లా ఎన్‌జిఒ నాయకురాలు కె.సునీత, పంచాయతీరాజ్ జిల్లా అసోసియేషన్ (పిడబ్ల్యూ) అధ్యక్షులు ఎంవి కోషోర్, సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలన్నారు. గౌరవ అధ్యక్షులు కృష్ణారావు ఆధ్వర్యంలో త్వరలో సమావేశం నిర్వహించుకుని సభ్యుల సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

దీనిపై డిపిఒ మల్లికార్జునరావు స్పందించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అందరూ తప్పకుండా అమలు జేయాలని, పంచాయతీల అభివృద్ధికి పన్నులు నూరు శాతం వసూళ్ల చేయాలని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుండాలని చెప్పారు. ఏమైన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతాంగ సమస్యలపై రైతు సంఘం కృషి అభినందనీయం

జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ

ఏలూరు :రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వ్యవసాయంలో మెలకువలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తున్న ఎపి రైతు సంఘం కృషి అభినందనీయమని జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ అన్నారు. జిల్లా కమిటీ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి, ఆయా వ్యవసాయ సంబంధ శాఖల దృష్టికి తీసుకెళ్తూ రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా రైతు సంఘం పనిచేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతులు సంఘటితం కావాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరలు అందేలా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం రావాలన్నారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులకు మేలు జరిగేలా మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి వై.సుబ్బారావు, రైతు సంఘం నాయకులు గండి రాజా, ఎస్.అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మన రైతు వాణి డైరీ ఆవిష్కరణ

పెదపాడు :రైతు సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన మన రైతు వాణి-2023 డైరీని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆళ్ల సతీష్ చౌదరి ఆదివారం ఆవిష్కరించారు. వట్లూరులోని సతీష్ చౌదరి కార్యాలయం వద్ద నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో సతీష్‌చౌదరి మాట్లాడుతూ ఎపి రైతు సంఘం రైతుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మన రైతు వాణి వ్యవసాయ మాసపత్రిక ద్వారా రైతులకు వ్యవసాయంలోని మెలకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు సంఘం అందించడం ద్వారా రైతులకు ప్రయోజనకరమన్నారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రైతాంగ సమస్యలు పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో ఉద్యాన పంటలు, వ్యాపార పంటలు, ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వట్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఆళ్ల శివరామకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా నూతన సంవత్సర వేడుకలు

ఏలూరులో...

పజాశక్తి - ఏలూరు టౌన్

కొత్త సంవత్సరం ప్రతి ఇంట్లో ఆనందాలను నింపాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆకాంక్షించారు. నూతన సంవత్సర సందర్భంగా ఆదివారం ఏలూరు నగరంలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, కార్పొరేటర్లు, వ్యాపార, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున స్థానిక పవర్‌పేటలోని మేయర్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులకు పుష్పగుచ్ఛాలను అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన ఆంగ్ల సంవత్సరంలో ఏలూరు నగరంలోని ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, ఉల్లాసం, సంతోషాలతో విలసిల్లాలన్నారు. నూతన లక్ష్యాలను సాధించడానికి నూతన సంవత్సరం ఎంతగానో ప్రేరేపిస్తుందని ఆమె అన్నారు. రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని సారధ్యంలో నగరాన్ని అభివృద్ధి దిశగా తమ పాలకవర్గం నడిపిస్తుందని చెప్పారు.

యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ సబ్బితి నరసింహమూర్తి నూతనసంవత్సరం కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అనంతరం 2023 యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జీని, డిప్యూటీ మేయర్ నూకపేయి సుధీర్‌బాబును, ఎంపిపి పి.శ్రీనివాసరాజును, ఎండిఒ ప్రణవిని, పలు అధికారులను కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియ జేస్తూ, డైరీ, క్యాలెండర్ అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, నాయకులు జివి.సూరపరాజు, పి.శ్రీనివాస్‌కుమార్, పివి.సుబ్బారావు, కోటేశ్వరరావు, పి.సత్యనారాయణ, బాషా, కె.దేవీప్రసాద్, బి.శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : నూతన సంవత్సర వేడుకలను పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకున్నారు. ఆదివారం నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని పట్టణంలో పలువురు ప్రముఖులు ప్రభుత్వ శాఖ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు స్థానిక ఎంఎల్ఎ ఎలిజాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వైసిపి నేతలకు, ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి కొదమ జ్యోతికి మండల ప్రజా ప్రతినిధులు పుష్ప గుచ్చాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి కొదమ జ్యోతి మండల ప్రజా ప్రతినిధులకు, ఉద్యోగులకు, ప్రజలకు శుభాకంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాధరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలకు కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో చేరుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

టి.నరసాపురం : మండలంలో నూతన సంవత్సర వేడుకలు పలు ప్రార్థనా మందిరాల్లో, గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టి.నరసాపురం, పుట్రేపు, ప్రకాష్‌నగర్, బొర్రంపాలెం, గండిగూడెం, మక్కినవారిగూడెం, కేతవరం తదితర గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మర్రిగూడెంలో సుమారు వెయ్యి మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు కురసం నిరీక్షణరావు, అధ్యక్షులు జి.జ్ఞానరాజు, సిహెచ్.హెూషేయ, సిహెచ్.రమేష్, టి.ప్రసన్నకుమార్, డానియల్ రాజ్, ప్రసన్నరాజు, రాజు, కృపాదానం, ఉన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి : ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల ప్రజలు ఆదివారం ఆనందోత్సాహలతో ఘనంగా జరుపుకున్నారు. ఆగిరిపల్లి తహాశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద కేక్‌ను కట్ చేసి సిబ్బందికి పంచి పెట్టారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఎఎస్ఎన్.మూర్తి, ఎంఎల్ఎ ప్రతాప్ అప్పారావును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎఎల్ఆర్ ఆర్ఐ.కె.లక్ష్మీనాంచారమ్మ, ఎంఆర్ఐ ఎంవి.రమణ, ఎఆర్ఐ పి.శ్రీనివాసరావు, సీనియర్ విఆర్ఒ టి.రవిశేఖర్, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరులో...

ముసునూరు : 2023లో అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మండల వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహాశీల్దార్ దాసరి సుధ, ఆధ్వరంలో కేకు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి : నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ముదినేపల్లి మండల ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణను పలువురు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధా, వైసిపి నాయకులు గంటా కోటేశ్వరరావు, కె.విష్ణువర్ధన్, బోయిన రామరాజు, షక్ అల్లాభక్షు, దివి సతీష్, రాచూరి కుమార్, బొర్రా శేషుబాబు, శీలం రామకృష్ణ, పైడిపాటి వెంకటరమణ, సాయి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిపికి పుష్ప గుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

యుటిఎఫ్, పిఆర్‌టియు నూతన సంవత్సర క్యాలెండర్స్‌ను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వాసులు, యువకులు, చిన్నలు పెద్దలతో చర్చిలు కిటకిటలాడాయి. మండలంలోని కొరగుంటపాలెం చర్చిలో పాస్టర్ ఉచ్చుల విజయకుమార్ ఆధ్వర్యంలో గ్రామ పిఎసిఎస్ చైర్‌పర్సన్ అచ్యుత రాంబాబు చేతులు మీదుగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

ఎస్ఇబి సమర్థవంతంగా పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మద్యం, ఇసుక విషయంలో అక్రమాలకు ఆస్కారం ఉండరాదని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాల్సిందేనని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఇబి) జాయింట్ డైరెక్టర్ నక్కా సూర్యచంద్రరావు, ఇతర అధికారులు, సిబ్బంది స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మద్యం, ఇసుక అక్రమాల నిరోధానికి ఏర్పాటు చేసిన ఎస్ఇబి మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఏదైనా సమాచారం రాగానే దానిపై ఖచ్చితంగా దృష్టి పెట్టి పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఏలూరు, నూజివీడు డిఎస్‌పిలు పైడేశ్వరరావు, అశోక్ కమార్ గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

దాసరి సుధకు ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ముసునూరు

తమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న దాసరి సుధ సాయి త్రిభాయి పూలే ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముసునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దాసరి సుధ ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఈ ఒక్క ఉపాధ్యాయురాలికి మాత్రమే అవకాశం దక్కిందన్నారు. ఈ నెల మూడో తేదీన తిరుపతిలోని ఆఫీసర్స్, కల్చరల్ అండ్ సోషల్ క్లబ్‌లో తెలంగాణా గవర్నర్ తమిళిసాయి చేతుల మీదగా అవార్డు అందుకోనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా దాసరి సుధను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు అభినందించారు.

చింతలపూడిలో జోరుగా కోడిపందేలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో కోడిపందేలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. చింతలపూడి మండలంలోని లింగగూడెం, చింతంపల్లి, సీతానగరం గ్రామాలతో పాటు పలుచోట్ల ఆదివారం కోడిపందేలు విచ్చలవిడిగా నిర్వహించారు. సంక్రాంతికి ముందే కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. చింతలపూడి మండలంలో పెద్ద పందేలు జరిగినట్లు తెలుస్తోంది. కొన్నిరోజుల క్రితం నుంచి కోడిపందేలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. దీనిపై ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ కోడిపందేలకు అనుమతులు లేవని చెప్పారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయానికి వచ్చే యాత్రికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నటు నూకాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజన్న తెలిపారు. స్థానిక నూకాలమ్మ ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాజన్న సత్యనారాయణ సమక్షంలో ఆవిష్కరించారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా నూకాంబిక సేవా బృందం వారితో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సోమవారం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయానికి వచ్చే యాత్రికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, మండవల్లి గ్రామ కాపురస్తులు వీరమల్లు శ్యాం ప్రసాద్ గారి కుమారుడు వీరమల్లు శ్రీ వెంకట దుర్గా మల్లేశ్వరరావు అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు మండవల్లి మండలం, మండవల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం.373/5రులో చ.గ.194 స్థలమును అవ్వారు వుయ్యూరు గారి వారసుల నుండి కొనుగోలు చేసి మండవల్లి సబ్‌రజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం.662/2022రుగా రిజిస్ట్రీ పొందియున్నారు. వారు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు లోను పొందుటకై దరఖాస్తు చేసియున్నారు. సదరు ఆస్తిపై అవ్వారు ఉయ్యూరు గారి వారసుల విషయమై గానీ మరియు ఈ క్రయ దస్తావేజు విషయమై గానీ ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులోగా నాకు గానీ, నా క్లయింటునకు గానీ తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. అట్లు కానిచో తదుపరి వచ్చిన క్లైయిమ్స్ ఏమియూ నా క్లయింటును బైండ్ ఓవర్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

కె.వి.పి.మాధవరావు
ఏలూరు అడ్వకేట్ & నోటరీ, ఏలూరు.
తేది.31.12.2022 సెల్: 9440111033